

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు..

జిల్లాలో స్వయం సహాయక బృందాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని డీఆర్డీవో చందర్‌నాయక్ సూచించారు.

- 8లో ▸



రుణమాఫీపై ఆశలు

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. రూ. 2 లక్షల పంట రుణం మాఫీ చేస్తారని ఆశిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.7 /20.5

వాతావరణం

ఆకాశం ఉదయం నుంచి మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేవంత్‌ను సీఎంగా ప్రకటించడం హర్షణీయం

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టేందుకు ఏఐసీసీ నాయకత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో జిల్లాలో అభివృద్ధి ఉరకలెత్తేందుకు పాటుపడతామన్నారు. అదేవిధంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా ముందుకెళ్తామన్నారు. జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి రైతు దీక్ష చేసినప్పటి నుంచి ఆయనకు జిల్లాతో అనుబంధం ఉందన్నారు. రేవంత్ ఎంపిక నేపథ్యంలో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావ్ ఠాక్రేకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

10వ తరగతి పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నిజామాబాద్ అర్బన్ : పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువును పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ చివరి తేదీ కాగా ఈనెల 7వ తేదీ వరకు పొడిగించామన్నారు. రూ.50 అదనపు రుసుంతో విద్యార్థులు ఫీజును చెల్లించాలన్నారు. రూ.200 అదనపు రుసుంతో ఈనెల 21వ తేదీ వరకు, రూ.500 అదనపు రుసుంతో జనవరి 3వ తేదీ వరకు కూడా పొడిగించినట్లు ఆయన తెలిపారు.

సీటీసీలో కానిస్టేబుళ్ల కోసం మెస్ టెండర్

ఖలీల్‌వాడి : జిల్లాలోని పోలీస్ శిక్షణకేంద్రంలో శిక్షణకోసం వచ్చే పోలీస్ కానిస్టేబుళ్లకు భోజనం అందించే నిమిత్తం టెండర్‌ను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ జయ్‌రాం ప్రకటనలో పేర్కొన్నారు. మెస్‌కీపింగ్‌లో రెండేళ్ల అనుభవం, రన్నింగ్‌లో ఉన్న రెస్టారెంట్స్ నిర్వాహకులు రూ. 500 డీడీ చెల్లించి టెండర్ దరఖాస్తులు పొందాలన్నారు. టెండర్‌పై అనుమానాలుంటే ముందస్తుగా ఈనెల 11న పోలీస్‌కమిషనరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు సీటీసీ పోలీస్ ట్రెయినింగ్ సెంటర్ ఏసీపీ శ్రవణ్ కుమార్ (8712659816)ను సంప్రదించవచ్చన్నారు. ఈ నెల చివరి వరకు టెండర్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

నేటి నుంచి యూజీసీ నెట్ పరీక్షలు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్ : నేటి నుంచి యుజీసీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. జిల్లా కేంద్రంలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్, ఆర్మూర్‌లోని క్షత్రియ ఇంజినరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ పరీక్ష జరుగనుంది. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగనున్నాయి. వివరాలకు 89781 98421లో సంప్రదించాలని కోరారు.


భగవద్గీతపై విద్యార్థులకు పోటీలు

నిజామాబాద్ సిటీ : గీతా జయంతి సందర్భంగా ఈ నెల 9, 10 తేదీలలో విద్యార్థులకు భగవద్గీతపై పోటీలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ పరిషత్ ఆర్గనైజర్ సీతారామచంద్రమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. భగవద్గీత మూడవ అధ్యాయం కర్మయోగంలో ఒకటి నుంచి 30 శ్లోకాల వరకు 6, 7 తరగతులకు ఒక విభాగం, 8, 9 తరగతి వరకు మరో విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే భగవద్గీతలో మొత్తం శ్లోకాలు వచ్చిన వారికి 18 సంవత్సరాల్లోపు వారికి ఒక విభాగం, 19 నుంచి 60ఏళ్ల వరకు మరో విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెలా 9న నిజామాబాద్‌లో రైల్వే స్టేషన్ వద్ద గీతా భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు పోటీలు జరుగుతాయని, అలాగే 10న కామారెడ్డిలో సరస్వతి విద్యామందిర్ కాకతీయ నగర్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు.

వివరాలకు 94909 97596 సంప్రదించాలని ఆయన కోరారు. ఆసక్తి గల వారు పైన ఉన్న ఫోన్‌నంబర్‌లో సంప్రదించి పోటీల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా వా రు కోరారు.

తీర్పులో ప్రత్యేకం

- విలక్షణంగా స్పందిస్తోన్న ఉమ్మడి జిల్లా ఓటర్లు
- సిట్టింగ్ సీఎం, సీఎం అభ్యర్థిని ఓడించిన వైనం
- గత పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె కవిత ఓటమి
- ఈ రెండుసార్లూ పట్టం కట్టింది బీజేపీకే కావడం విశేషం
- తెలంగాణ ఉద్యమంలో బీఆర్‌ఎస్‌కు ఊపిరిలూదిన ప్రజలు
- బీజేపీకీ గేట్‌వేగానూ నిలుస్తున్న ఉమ్మడి ఇందూరు వాసులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలో ఏ పార్టీ గాలి వీచినా, ప్రాబల్యం పెంచుకుంటున్నా దానికి మొదటి అడుగు ఇందూరులోనే పడుతుందనేది స్పష్టమవుతోంది. బీఆర్‌ఎస్ ఉద్యమ పార్టీలతో ప్రజల్లోకి వెళ్లడం, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి పునాదిగా నిలిచింది కూడా ఇందూరు జిల్లానే. ఇక్కడ జిల్లా ప్రజాపరిషత్ గెలుపుతో కేసీఆర్ తన ప్రస్థానాన్ని మరింత పెంచుకుంటూ వెళ్లిన విషయం అందరికీ తెలిసిందే. ఇదిలా ఉండగా బీజేపీకి కూడా ఇందూరు జిల్లానే ఊతంగా నిలుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎంపీగా ఉన్న కేసీఆర్ కుమార్తె కవితను ఓడించి అనూహ్యంగా బీజేపీ తరుపున బరిలో నిలిచిన అర్వింద్‌ను ఎంపీగా ఎన్నుకున్నారు ఇక్కడి ఓటర్లు.

ఎన్నికల్లో తీర్పుని వ్వడంలో ఉమ్మడి నిజామాబాద్

జిల్లా ప్రజలు ఎల్లప్పుడూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. జిల్లా ప్రజలు ఇస్తున్న తీర్పులు రాష్ట్రవ్యాప్తంగా ట్రెండ్‌సెట్ చేస్తుండడం గమనార్హం. దేశ రాజకీయాల్లోనూ ఇందూరు పేరు స్పష్టంగా వినిపిస్తోంది.

కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు..

ప్రస్తుత ఎన్నికల్లో పూర్తిగా జవసత్వాలు కోల్పోయిన కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు కట్టబెట్టి రాష్ట్రంలో అధికారం వచ్చేలా చేయడంలో ఇందూరు పాత్ర చెప్పుకోదగింది. మరోవైపు బీజేపీని మూడు స్థానాల్లో గెలిపించడం విశేషం. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీని గెలిపించడంతో పాటు ఈసారి ఏకంగా బీజేపీకి మూడు సీట్లు కట్టబెట్టడం విశేసం. గతంలో ఇక్కడ మొదటి జిల్లా ప్రజాపరిషత్‌కు పట్టం గట్టి రాష్ట్రం వచ్చాక వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసేలా అవకాశం ఇచ్చిన జిల్లా ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీకి గేట్‌వే మాదిరిగా బాటలు వేస్తుండడం గమనార్హం. ఇందూరు ఉమ్మడి జిల్లా ప్రజలు రాష్ట్రంలోనే ప్రత్యకంగా తాజా ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 4, బీజేపీకి 3, బీఆర్‌ఎస్‌కు 2 సీట్లు ఇచ్చారు. కాగా బీజేపీ జాతీయ నాయకత్వం కూడా పసుపు బోర్డు ప్రకటన నుంచి నిజాం షుగర్స్ తెరిపిస్తామనే వరకు, ఇతర అంశాల్లో ఈ జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుండడం విశేషం.

కామారెడ్డిలో వినూత్నంగా..

ఇక తాజాగా కామారెడ్డి శాసనసభ స్థానంలో నిలిచిన సీఎం కేసీఆర్‌కు, సీఎం అభ్యర్థి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఏకకాలంలో ఓటమి రుచి చూపించారు ఓటరు మహాశయులు. వీరిద్దరినీ కాదని బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డికి పట్టం కట్టారు. దీంతో కామారెడ్డి ప్రజలు చరిత్రపుటల్లో తమకు తిరుగులేని ప్రత్యేకమైన పేజీని లిఖించుకున్నారు. ఈ ఫలితం జాతీయస్థాయిలో సంచలనం కలిగించింది. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఉమ్మడి ఇందూరు ప్రత్యేకతలు అనేకం ఉన్నాయి.

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో..

రాష్ట్రంలోనే అత్యధికంగా బీజేపీకి ఓట్లు ఇచ్చిన ఇందూరు జిల్లా పార్టీకి ప్రాబల్యం పెంచే విషయంలో గేట్‌వేగా నిలిచింది. ఇప్పటికే మూడుసీట్లు దక్కించుకున్న బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య రానున్న పార్లమెంట్ ఎన్నికలు పోటాపోటీగా జరిగే అవకాశాలు పెరిగాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో కవిత బీజేపీ చేతిలో ఓడిపోగా ఈసారి కేసీఆర్ కామారెడ్డిలో ఓటమి చవిచూశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో 45.22 శాతంతో 4,80,584 ఓట్లు వచ్చాయి. ఇక తాజా శాసనసభ ఎన్నికల్లో కూడా ఉమ్మడి జిల్లాలో, నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లలో సైతం బీజేపీకి భారీగా ఓట్ల శాతం పెరిగింది.

బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం

శాసనసభ సెగ్మెంట్	2018లో	2023లో
ఆర్మూర్	13.96	44.09
బోధన్	05.31	19.52
జుక్కల్	12.43	17.28
బాన్సువాడ	02.06	14.08
ఎల్లారెడ్డి	03.77	14.61
కామారెడ్డి	09.52	34.55
అర్బన్	15.99	40.82
రూరల్	09.52	25.05
బాల్కొండ	02.00	17.03
కోరుట్ల	09.79	33.67
జగిత్యాల	03.02	23.89

చిత్తయిన పత్తి రైతు

- జిల్లాలో 400 ఎకరాల్లో పంటకు అపార నష్టం
- వడగండ్ల వర్షానికి నేలకొరిగిన మొక్కలు, రాలిపోయిన పత్తి కాయలు
- లబోదిబోమంటున్న రైతులు
- న్యాయం చేయాలని అధికారులకు వేడుకోలు



ఆరేపల్లిలో వడగండ్ల వానకు నేలకొరిగిన పత్తిపంట

నిజామాబాద్ రూరల్ : జిల్లాలో 400 ఎకరాలకు పైగా రైతులు పత్తి పంట వేయగా, గత నెల 28వ తేదీ కురిసిన వడగండ్ల వర్షానికి పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అలాగే అపరాల పంటకు కూడా తీవ్ర నష్టం జరిగింది. పత్తి పంట మొత్తం కాయ దశలో ఉండగా ఆరోజు కురిసిన వడగండ్ల వానకు ఆయా దశలో ఉన్న పంట పూర్తిగా నేలకొరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతుల వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లగా అక్కడ కేవలం నేలకొరిగిన పత్తిమొక్కలను చూసి విస్మయం చెందారు. పత్తి రైతు ఒక్కో ఎకరానికి ఇప్పటికే రూ. 25,000 నుంచి రూ. 30వేల వరకు ఖర్చు చేశారు. ఒక్కో రైతు దాదాపు 10 ఎకరాల్లో పత్తి పంట వేసి లక్షలు ఖర్చు చేశారు. నష్టపోయిన పత్తి పంటపై పెట్టిన ఖర్చును పరిహారం రూపంలో ప్రభుత్వం అందించాలని రైతులు కోరుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా వడగండ్ల వాన తమను ఆర్థికంగా కుదేలు చేసిందని బాధపడుతున్నారు.

నష్టపరిహారం చెల్లించాలి..



మా గ్రామంలో దాదాపు 150 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాం. గతనెల 28వ తేదీ కురిసిన వడగండ్ల వానకు పత్తి పంట పూర్తిగా నేలమట్టమై చేతికి రాకుండా పోయింది. అధికారులు వచ్చి నష్టాన్ని అంచనా వేశారు. పరిహారం తొందరగా అందిస్తే ప్రస్తుత రబీ సీజన్లో వరి పంటను సాగు చేద్దామనుకుంటున్నాం. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. – కదం రాము, ఆరేపల్లి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

జిల్లాలో దాదాపుగా 400 ఎకరాల పైచిలుకు పత్తి పంటను పండించారు. గత నెల 28న కురిసిన అకాల వర్షాలకు పత్తిరైతులు నష్టపోయారు. దీనిపై మండల స్థాయి వ్యవసాయాధికారులు నివేదికను తయారు చేస్తున్నారు. రెండురోజుల్లో ఉన్నతాధికారులకు సమర్పిస్తాం. రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తాం.

– వాజీద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి

పత్తి రైతును ఆదుకోవాలి

నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో పత్తిని పండించా. గతనెలలో కురిసిన వడగళ్ల వానకు పత్తి పంట కాస్త పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి దాదాపు రూ. 30 వేల ఖర్చు వచ్చింది. దీంతో ఏమిచేయలో పాలుపోక అయోమయంలో ఉన్నాను. ప్రభుత్వం సహకారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

– అంబటి శంకర్, ఆరెపల్లి

జొన్న రైతుల గుండెల్లో 'తుపాన్'



బాల్కొండ : వాణిజ్య పంట అయిన జొన్నను సాగు చేస్తున్న రైతులను మిగ్‌జాం తుపాన్ కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ఆర్మూర్ డివిజన్‌లో 50 ఎకరాల్లో రైతులు ఎర్ర, తెల్లజొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జొన్న ఈనిక దశలో ఉంది. వాతావరణం మేఘావృత్తమై ఉండటంతో పేనుబంక తెగుళ్ల వ్యాపించవచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా కంకులు బయటకు రాకుండా పోతాయంటున్నారు. జొన్న పంట వాణిజ్యపంట కావడంతో రైతులకు ప్రతి ఏడాది ధరాఘాతం తప్పడం లేదు. ప్రస్తుతం ప్రకృతి సైతం కన్నెర్ర చేయడంతో పెట్టుబడి కూడా వస్తుందో లేదోనని అనుమానిస్తున్నారు.

ఆందోళనలో చి'వరి' రైతులు

తుఫాన్ ప్రభావం వల్ల మూడు రోజుల పాటు జిల్లాలో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తుండటంతో వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఆలస్యంగా పంటను సాగు చేసిన రైతుల వరి ప్రస్తుతం కల్లాల్లో, రోడ్లపై అలాగే ఉంది.

జెడ్పీ సమావేశం సాదాసీదాగానే!

- బాధ్యతలు స్వీకరించని నూతన ఎమ్మెల్యేలు
- కేవలం జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు, అధికారులతోనే..

నిజామాబాద్‌నాగారం : జిల్లా పరిషత్ సాధరణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగానే జరుగనుంది. ప్రతి మూణ్నెళ్లకొకసారి జెడ్పీ సమావేశాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన నిర్వహిస్తారు. అయితే ఈసారి మాత్రం ప్రజాప్రతినిధులెవ్వరూ హాజరయ్యే పరిస్థితి లేదు. రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, గెలిచిన ఎమ్మెల్యేలు ఇంకా ప్రమాణస్వీకారం చేయకపోవడంతో జెడ్పీ సమావేశానికి రాని పరిస్థితి. ఇక కేవలం జెడ్పీటీసీ, ఎంపీపీలు, జిల్లాస్థాయి అధికారులే హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గతంలోనూ వాయిదానే..

జిల్లాలో ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీ ఉన్నారు. ప్రతి మూణ్నెళ్లకొకసారి జెడ్పీ సమావేశం జరుగుతుంది. మూణ్నెళ్లక్రితం సెప్టెంబర్‌లో జరిగిన జెడ్పీ సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కాలదు. అలాగే జెడ్పీటీసీలు కూడా హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదాపడ్డ సంగతి తెలిసిందే.

మళ్లీ బుధవారం జెడ్పీ సమావేశం జరుగనుండగా కొత్తగా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయకపోవడంతో వారు హాజరయ్యే పరిస్థితి లేదు. జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ జెడ్పీ మీటింగ్‌కు హాజరైన దాఖలాల్లేవు. కేవలం జెడ్పీటీసీలు, ఎంపీపీలు అధికారులతోనే సమావేశాన్ని ముగించనున్నారు.

బడా రాంమందిర్ రికార్డులు స్వాధీనం

నిజామాబాద్ సిటీ : నగరంలోని గాజుల్‌పేట్ బడా రాంమందిర్ ఆలయం, వాటికి సంబంధించిన భూముల రికార్డులను దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గత నెల నవంబర్ 25న శాఖ ఉప కమిషనర్ వరంగల్ జోన్ ఆదేశానుసారం బడారాంమందిర్, దాని అనుబంధ దేవాలయం సారంగపూర్ శ్రీ హనుమాన్ మందిరాల ఆలయ కార్యాలయాలను స్వాధీనం చేసుకుని వాటికి సీల్ వేశారు. మంగళవారం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ ఆదేశాల మేరకు రెండో టౌన్ ఎస్సై అశోక్, రెవెన్యూ అధికారుల సమక్షంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల, ఈవో వేణు సీల్‌ను తొలగించారు. బడారాంమందిర్ ఉత్తర అధికారి దినకర్ స్వామి నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. అనంతరం విజయ్‌స్వామి ఉత్తరాధికారిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో బడారాంమందిర్‌కు చెందిన భూములు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉండటంతో దేవాదాయ శాఖ రంగంలోకి దిగింది. భూములు విక్రయించిన వారిపై కేసులు పెట్టింది. ప్రస్తుతం కేసులు కోర్టులో కొనసాగుతోంది. రాంమందిర్‌కు చెందిన భూములు, ఆలయానికి సంబంధించి రికార్డులను అప్పగించాలని ఉత్తరాధికారి విజయ్‌కుమార్‌ను దేవాదాయ శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇచ్చారు. కాని అధికారులు, పోలీసులు వచ్చే సమయానికి విజయ్‌కుమార్ వెళ్లిపోయారు. దాంతో పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో రాంమందిర్ ఆలయం కా ర్యాలయానికి వేసిన తాళాలను పగలగొట్టి కార్యాలయంలో బీరువాలను తెరిచి అందులో ఉన్న రికార్డులను, కొద్దిపాటి వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

సారంగాపూర్‌లో..

బడా రాంమందిర్ అనుబంధం రూరల్ మండలం సారంగపూర్ హనుమాన్ ఆలయం కార్యాలయం సీల్‌ను దేవాదాయ శాఖ అధికారులు తొలగించి బీరువాలో ఉన్న ఆలయానికి చెందిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ఈవో వేణు రికార్డులను బీరువాలో పెట్టి దానికి మరో తాళాన్ని వేయించారు. రెండురోజుల్లో సారంగపూర్ హనుమాన్ ఆలయంలో హుండీని తెరుస్తామన్నారు. కాగా బడారాంమందిర్ ఉత్తరాధికారి విజయ్‌కుమార్ బడా రాంమందిర్‌ను దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవటంపై కోర్టుకు వెళ్లనున్నట్లు సమాచారం.



బడా రాంమందిర్‌లో గదికి వేసిన సీల్‌ను తొలగిస్తున్న దేవాదాయ శాఖాధికారులు

రైతు చెంతకే వాతావరణ సమాచారం

- వాట్సాప్ ద్వారా 112 గ్రూపులు, 15 వేల మంది సభ్యులకు..
- కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం ఆధ్వర్యంలో సేవలు

రుద్రూర్ : ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, పంటల సాగులో వివిధ రకాల చీడపీడల ఉధృతి పెరిగి పంట నష్టం జరుగుతోంది. మారుతున్న వాతావరణం, చీడపీడల వల్ల పంట నష్టం జరుగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వాట్సాప్, ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు అందచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, కంది, సోయాచిక్కుడు, పసుపు పంటలు సాగు చేస్తారు. పూర్వం రైతులకు సకాలంలో సరైన మందులు వాడటం తెలియక పలు రకాల పురుగు మందులను పిచికారి చేసి, ఖర్చులు పెరిగి, లాభాలు పొందలేకపోయేవారు. పంట విత్తినప్పటి నుంచి, కోతకు వచ్చిన వరకు, పంట ఉత్పత్తిని ఆరబెట్టిన దగ్గరి నుంచి మార్కెట్‌కు తరలించే వరకు వాతావరణంలో ఆకస్మికంగా జరిగే మార్పుల వల్ల రైతులు అయోమయానికి గురవుతున్నారు. దీంతో రైతులకు అవసరమయ్యే సమాచారాన్ని అందించేందుకు రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మూడేళ్ల క్రితం (2020 అక్టోబర్) వ్యవసాయ వాతావరణ విభాగం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఐదు రోజుల ముందస్తు వాతావరణ సమాచారాన్ని, వ్యవసాయ సలహాలను బులెటిన్ల రూపంలో రైతులకు చేరవేస్తున్నారు.



వాట్సాప్ ద్వారా వాతావరణ సమాచారం తెలుసుకుంటున్న రైతు

రైతులకు అత్యవసరం..



ఒకసారి మూడెకరాల వరి ఆరబెట్టాను. రాగల రెండు రోజులు వర్షం కురిసే అవకాశం ఉందని వాట్సాప్ ద్వారా సమాచారం వచ్చింది. ఎందుకైనా మంచిదని పట్టాలు తెచ్చి కప్పాను. సమాచారంలో ఇచ్చినట్లు రెండు రోజులు వర్షం కురిసింది. దీనివల్ల ధాన్యం యొక్క నాణ్యత దెబ్బతినకుండా రక్షించుకున్నాను. – అర్జున్ రావు, రైతు, హెగ్డోలి, కోటగిరి

ఎప్పటికప్పుడు వాతావరణ సూచనలు



ప్రస్తుత వాతావరణ పరిస్థితు లలో యాసంగి సాగుకు మేలై న యాజమాన్య చర్యలు, చీడపీడల నివారణ సమాచారం, వర్షపాత సూచనల కోసం రై తులు వాట్సాప్ గ్రూప్‌లలో పేర్లను నమోదు చేసుకోవాలి. ఇందుకు ఎల్ సంజయ్, వాతావరణ పర్యవేక్షకుడు 97007 00590కు మెసేజ్ చేయవచ్చు. కాల్‌చేసి వాతావరణ సూచనలను పొందవచ్చు. – బి శ్రీలక్ష్మి, కేవీకే వ్యవసాయ వాతావరణ శాస్త్రవేత్త

క్షణాల్లో సమాచారం ఇస్తున్నాం..



జిల్లాలో వివిధ పంటల్లో సంభవించే పురుగులు, తెగుళ్ల బెడద, కలుపు నివారణకు సంబంధించిన మందులు సమాచారాన్ని కేవీకేలోని జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం అధికారులు ఎప్పటికప్పుడు బులెటిన్ రూపంలో రైతులకు అందిస్తున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో జిల్లాలో సుమారు 112 వాట్సాప్ గ్రూ ప్‌లు తయారుచేసి సమాచారాన్ని 15వేల మందికి పైగా పంపిస్తున్నారు. గ్రూప్‌లో చేరేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. – డా అంజయ్య, కేవీకే కోఆర్డినేటర్

కేవీఆర్‌ను పదవి వరించేనా?

- ఇద్దరు ఉద్ధండులను ఓడించిన వెంకట రమణారెడ్డి
- బీజేపీ శాసనసభా పక్షంలో పదవి దక్కే చాన్స్!

సాక్షి, కామారెడ్డి: ఇద్దరు ముఖ్య నేతలను ఓడించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో తొలిసారి అడుగుపెడుతున్నారు. ఆయనకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తుందన్న అభిప్రాయం బీజేపీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. కామారెడ్డిలో ముఖ్యమంత్రిని, కాబోయే ముఖ్యమంత్రిని ఒకేసారి ఓడించడం ద్వారా చరిత్ర సృష్టించిన వెంకటరమణారెడ్డికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ఫోన్ చేసి జెయింట్ కిల్లర్ అంటూ అభినందించారు. వెంకటరమణారెడ్డి నామినేషన్ వేయక ముందే నిర్వహించిన బైక్‌ర్యాలీ, సభల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆయన ఫాలోయింగ్‌ను చూసి ఆశ్చర్యపోయారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే వెంకటరమణారెడ్డిని మంత్రి వర్గంలో తీసుకునేలా ప్రయత్నిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేంత మంది ఎమ్మెల్యేలు గెలవకపోవడంతో మంత్రిని చేసే అవకాశం లేకుండాపోయింది. అయితే బీజేపీ శాసనసభా పక్షంలో ఆయనకు పదవి కట్టబెడతార న్న ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ అధికార ప్రతినిధి



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌ గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్‌ టీపీసీసీ అధ్యక్షుడు, కాబోయే సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని మంగళవారం కలి సి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని హోటల్‌ ఎల్లాలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యకర్తలు, నాయకుల పోరాటఫలితంగా ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారని, కష్టపడిన ప్రతి నాయకుడికి మంచి భవిష్యత్‌ ఉంటుందని రేవంత్‌రెడ్డి అన్నారని వేణుగోపాల్‌ తెలిపారు.

కాపర్‌, ఆయిల్‌ చోరీ



పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): మండలంలోని వడ్లం గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌లోనుంచి కాపర్‌, ఆయిల్‌ చోరీకి గురైంది. ఎస్సై కోనారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. మడపటి శివలింగయ్య అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

జూడో పోటీలకు ఎస్‌ఆర్‌ విద్యార్థులు



నిజామాబాద్‌నాగారం: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో బుధవారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌ జూడో పోటీలకు ఎస్‌ఆర్‌ స్కూల్‌ విద్యార్థులు ఎంపికైనట్లు జోనల్‌ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్‌ తెలిపారు. బాలుర విభాగంలో రియాన్‌రాజ్‌, అనుదీప్‌, రేశ్వంత్‌, రోహన్‌, దివాకర్‌, రిషిత్‌, బాలికల విభాగంలో రిషిత, సాహితి, ప్రణీత, మీరాజాశ్విన్‌, శరణి, సాయినిత్య ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఆరు లక్షలు బుగ్గిపాలు

- షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- ఇల్లు కొనేందుకు దాచుకున్న నగదు దగ్ధం
- ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో ఘటన



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

ఇందల్వాయి: ఇంటిని కొనుగోలు చేసేందుకు దాచుకున్న రూ.6లక్షలు అగ్నికి ఆహుతైన ఘటన మండలంలోని ఎల్లారెడ్డిపల్లెలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ నరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పులి సాయిలు ఈ మధ్యే ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. ఈనెల 10వ తేదీన రూ.6లక్షల కిస్తు చెల్లించాల్సి ఉండడంతో డబ్బులను సర్దుబాటు చేసి ప్రస్తుతం ఉంటున్న ఇంట్లో దాచాడు. మంగళవారం షార్ట్‌సర్క్యూట్‌ కారణంగా ఇంటికి మంటలు అంటుకోవడంతో డబ్బులు కాలిపోయాయి. కలప ఇల్లు కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయని, మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తుండగానే నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. రూ.6లక్షల నగదు దగ్ధంకావడంతో సాయిలు కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖానికి లోనయ్యారు.

బంగారు భైరవుడికి డోలోత్సవం



పూల అలంకరణలో కాలభైరవుడు





పూజలు నిర్వహిస్తున్న కామారెడ్డి మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియ



బండ్ల ఊరేగింపులో భక్తులు



జిల్లా కేంద్రం నుంచి కాలినడకన వస్తున్న మహిళలు

రామారెడ్డి: దక్షిణకాశీగా వెలుగొందుతున్న ఇసన్నపల్లి(రామారెడ్డి) కాళభైరవుడి జన్మదిన వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం డోలా రోహణాన్ని(తొట్లె) కన్నుల పండువగా నిర్వహించారు. మూడు రోజులపాటు కొనసాగిన సంతతధారాభిషేకం మంగళవారం ఉదయం 6 గంటలకు ముగిసింది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సింధూర పూజలు నిర్వహించి మధ్యాహ్నం మూడు గంటలకు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం స్వామివారి బంగారు విగ్రహానికి డోలారోహణం నిర్వహించగా, లాలిపాటలతో ఆలయ పరిసరాలు పులకించాయి. కాలభైరవ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ఈవో ప్రభుగుప్తా, అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణశర్మ, సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం, అగ్నిగుండాలు

బుధవారం రాత్రి 3గంటల నుంచి రథోత్సవం ప్రారంభం కానుంది. కాలభైరవ ఉత్సవ విగ్రహం ఊరేగింపు అనంతరం వీరశైవ మహేశ్వరులతో అగ్నిగుండాలు (దక్షయజ్ఞం) ప్రారంభమవుతుంది. రథోత్సవం, అగ్నిగుండాలకు రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాదయాత్ర..

కామారెడ్డి టౌన్‌: కాలభైరవుని దర్శనం కోసం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి శ్రీకృష్ణపరివార కాలనీకి చెందిన మహిళలు పాదయాత్ర నిర్వహించారు. తాము ప్రతిఏటా కాలభైరవ స్వామి జన్మదినం రోజున పాదయాత్రగా వెళ్తామని వారు తెలిపారు.

రుణమాఫీపై ఆశలు

- బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో పూర్తికాని రుణమాఫీ ప్రక్రియ
- రూ.2లక్షల మాఫీపై రైతులకు హామీ ఇచ్చిన కాంగ్రెస్‌
- నూతన ప్రభుత్వం స్పందన ఏమిటో?



మోర్తాడ్‌(బాల్కొండ): రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ అధికారంలోకి రానుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పంట రుణమాఫీపై ఆ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 2018 ముందస్తు ఎన్నికల సందర్భంగా రూ.లక్ష వరకు పంట రుణాల మాఫీపై హామీ ఇచ్చినప్పటికీ.. సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ వెలువడే వరకు పూర్తిస్థాయిలో రైతులకు పంట రుణాల మాఫీ ఫలాలను అందించలేకపోయింది. పంట రుణాలు మాఫీ అయితే కొత్తగా రుణం తీసుకునే అవకాశం ఏర్పడుతుందని, తమకు ఆర్థికంగా ఆసరా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కాంగ్రెస్‌ విజయం సాధించడంతో తమకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ అవుతాయనే ఆశతో ఉన్నారు. 2018లో వ్యవసాయ శాఖ జిల్లాలో రుణమాఫీ అందుకునే రైతుల సంఖ్యను 2,91,188గా తేల్చింది. వీరికి రూ.లక్ష వరకు పంట రుణం మాఫీ చేయడానికి రూ.1,790 కోట్ల లక్ష్యంగా నిర్ణయించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన నుంచి రుణమాఫీపై నాన్చివేత ధోరణి అవలంబిస్తూ వచ్చింది. మొదట్లో రూ.25వేల వరకు, రెండో విడతలో రూ.50వేల వరకు పంట రుణాల మాఫీ అని ప్రకటించినా.. లక్ష్యానికి అనుగుణంగా మాఫీ చేయలేదు. గత ఆగస్టు నెలలో రూ.లక్ష వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తున్నామని, సెప్టెంబర్‌ రెండో వారంలోగా అర్హులైన అందరు రైతులకు పంట రుణాలను మాఫీ చేస్తామని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా అక్టోబర్‌ 9 వరకు విడతల వారీగా నిధులను విడుదల చేయగా, రైతులందరికీ రుణ మాఫీ కాలేదు. జిల్లాలో 67,553 మంది రైతులకు రూ.324.63 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇంకా రూ.1,465.77 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా రుణమాఫీ కోసం 2,23,635 మంది రైతులు నిరీక్షించారు. రుణమాఫీకి ఆర్థికశాఖ సరైన విధంగా నిధులను విడుదల చేయకపోవడంతో మెజార్టీ రైతులకు రుణమాఫీ ఫలాలు అందలేవు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారం చేపట్టనుండడంతో తొలినాళ్లలోనే రుణమాఫీ అమలు చేస్తారా అని రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వాణిజ్య పంటలను ఎక్కువ మంది రైతులు సాగు చేస్తున్నారు. అందువల్ల అనేక మంది రైతులకు రూ.3లక్షల వరకు పంట రుణాలు తీసుకుని ఉన్నారు. ప్రభుత్వం రూ.2లక్షల చొప్పున నిధులను విడుదల చేస్తే మిగతా మొత్తాన్ని తాము సమకూర్చుకుని బ్యాంకుల్లో రుణాలను చెల్లించి కొత్త రుణాలను తీసుకుంటామని రైతులు అంటున్నారు. కొత్తగా కొలువుదీరబోయే ప్రభుత్వం ఎలా స్పందిస్తుందోననే దానిపై సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

వేల్పూర్‌ రికార్డ్‌కు బ్రేక్‌

- 2014, 2018 ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలను అందించిన మండలం
- ప్రస్తుత ఎన్నికల్లో ఒకరి ఓటమి, మరొకరి గెలుపు
- బాల్కొండలో గెలిచిన ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్‌లో ఓడిన జీవన్‌రెడ్డి
- ఇద్దరిదీ ఒకే మండలం.. వేర్వేరు గ్రామాలు



వేముల ప్రశాంత్‌రెడ్డి



ఆశన్నగారి జీవన్‌రెడ్డి

మోర్తాడ్‌(బాల్కొండ): రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో ఇద్దరు ఎమ్మెల్యేలను అందించిన వేల్పూర్‌ మండలం.. ఆ రికార్డుకు ఈసారి దూరంగా నిలిచింది. బాల్కొండ, ఆర్మూర్‌ నియోజకవర్గాల నుంచి 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డిలది వేల్పూర్‌ మండలం కావడం విశేషం. ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌ మండల కేంద్రానికి చెందినవారు కాగా, జీవన్‌రెడ్డి ఇదే మండలంలోని జాన్కంపేట్‌ గ్రామానికి చెందిన వ్యక్తి. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఇద్దరికీ.. బీఆర్‌ఎస్‌ అధినేత ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు మూడుసార్లు అవకాశం కల్పించారు. అయితే ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డి ఒక్కరే గెలుపొందగా, ఆర్మూర్‌ నుంచి మూడోసారి పోటీ చేసిన జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. దీంతో వేల్పూర్‌ మండలం సాధించిన రికార్డ్‌ బ్రేక్‌ అయ్యింది. ఒకవేళ ఇద్దరూ విజయం సాధిస్తే ఒకే మండలానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలుగా హ్యాట్రిక్‌ విజయాన్ని నమోదుచేసేవారు. ఏదిఏమైనా అసెంబ్లీ చరిత్రలో ఒక మండలం నుంచి రెండుసార్లు ఇద్దరు ఎమ్మెల్యేలు గెలవడం రికార్డుగా మిగిలింది. ఇదే సమయంలో హ్యాట్రిక్‌ రికార్డు దూరమైంది.

దివ్యాంగుల దినోత్సవం నిర్వహించేది ఎప్పుడో?

- ఎలక్షన్‌ కోడ్‌ కారణంగా కార్యక్రమం వాయిదా..
- నిర్వహణపై నిర్ణయం తీసుకోని అధికారులు



ఆర్మూర్‌: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది డిసెంబర్‌ 3న ఘనంగా నిర్వహించి దివ్యాంగులకు మేమున్నామనే భరోసా కల్పించేది. అయితే ఎన్నికల కోడ్‌ కారణంగా ఈ ఏడాది దివ్యాంగుల దినోత్సవం నిర్వహించే విషయంలో అధికారులు నిర్ణయం తీసుకోలేదు. ఈనెల 3న ఓట్ల లెక్కింపు ఉండడంతో అధికారులు ఆ దిశగా ఆలోచనలు చేయలేకపోయారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా తెలంగాణ సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో గుర్తించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విలీన విద్యను అందిస్తున్నారు. నిజామాబాద్‌ జిల్లాలో సున్నా నుంచి నుంచి 18 సంవత్సరాల వయస్సున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు (21 వైకల్యాలతో బాధపడుతున్నవారు) సుమారు 2,560 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి 50 మంది రీసోర్స్‌ పర్సన్‌ల ద్వారా సేవలందిస్తున్నారు. ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన భవిత కార్యాలయాల్లో ఫిజియోథెరపీ క్యాంపులు, ఎస్‌ఆర్‌ఎస్‌టీసీ నిర్వహణ, స్పీచ్‌ థెరపీ, ఎర్లీ ఇంట్రవెన్షన్‌ తదితర సేవలను అందిస్తున్నారు. ప్రతి ఏడాది భవిత కేంద్రాల్లో దివ్యాంగుల దినోత్సవం నిర్వహణతో పాటు జిల్లా కేంద్రంలో సైతం వేడుకలు, ఆటల పోటీలు నిర్వహించడానికి నిధులను కేటాయిస్తారు. ఎన్నికల కారణంగా నిధుల కేటాయింపు, ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించలేదు. కోడ్‌ ముగియడంతో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఒక రోజును సూచిస్తూ నిధులు కేటాయిస్తేనే కార్యక్రమాలను నిర్వహించే అవకాశం ఉంటుంది. అధికారులు స్పందించాలని దివ్యాంగుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి

- మొబైల్‌ సైన్స్‌ ఎగ్జిబిషన్‌లో తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): శాస్త్ర, సాంకేతికత విజ్ఞానాన్ని భవిష్యత్‌తరానికి అందించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి సూచించారు. తెయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'జన్యుశాస్త్రంలో మార్పులు – ఆరోగ్య రంగంపై ప్రభావం' అనే అంశంపై మంగళవారం ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ వద్ద ఏర్పాటు చేసిన మొబైల్‌ ఎగ్జిబిషన్‌ను రిజిస్ట్రార్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువసైంటిస్టులను తయారుచేసే కృషిలో భాగంగా మొబైల్‌ సైన్స్‌ ఎగ్జిబిషన్‌ను జీన్‌ హెల్త్‌ కనెక్ట్‌ వారు నిర్వహించడం అభినందనీయమన్నారు. సీసీఎంబీ హైదరాబాద్‌, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్‌ టెక్నాలజీ మ్యూజియం రిసోర్స్‌ పర్సన్స్‌ మానవ ఆరోగ్యానికి జన్యులతో ఉన్న నిర్మాణ సంబంధంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎగ్జిబిషన్‌లో 20 రకాల జన్యు నమూనాలు, వీడియోలను ప్రదర్శించారు. మొబైల్‌ సైన్స్‌ ఎగ్జిబిషన్‌ను తెయూ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్‌ డిగ్రీ కళాశాల, సుద్దపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌, విక్టరీ, వందేమాతరం, ప్రెసిడెన్సీ, కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌ తదితర పాఠశాలల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు సందర్శించారు. రిసోర్స్‌ పర్సన్స్‌ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో తెయూ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ ఆరతి, కో ఆర్డినేటర్‌ మామిడాల ప్రవీణ్‌కుమార్‌, బయోటెక్నాలజీ హెచ్‌వోడీ జవేరియా ఉజ్మా, అధ్యాపకులు మహేందర్‌, కిరణ్మయి, ప్రసన్నశీల, రమేశ్‌నాయక్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద బోర్డుల ఏర్పాటు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజావద్ద జాతీయ రహదారికి ఇరువైపుల భారీ బోర్డులను సోమవారం ఏర్పాటు చేశారు. టోల్‌ప్లాజా చార్జీలు, నియమనిబంధనలతోపాటు అందించే సేవల వివరాలను బోర్డుల్లో సూచించారు.

ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి

- డీఆర్డీవో చందర్‌నాయక్‌



మాట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్‌

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఫుడ్‌ ప్రాసెసింగ్‌ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇతర వ్యాపారాల ద్వారా ఆర్థికంగా ఎదిగి తమ ఆదాయాన్ని పెంచుకోవాలని డీఆర్డీవో చందర్‌నాయక్‌ సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ట్రైజం ట్రైనింగ్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ (టీటీడీసీ)లో మంగళవారం నిర్వహించిన ఇందూరు జిల్లా మహిళా సహకార సమాఖ్య సమావేశానికి డీఆర్డీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, హార్వెస్టర్‌, వరికోతయంత్రాలు, ట్రాక్టర్‌ పనిముట్లను కొనుగోలు చేసేందుకు రుణాలు అందజేస్తామన్నారు. మహిళాసంఘాల సభ్యులందరూ బ్యాంక్‌ లింకేజీ రుణాలను తీసుకుని గ్రామసమాఖ్య, మండల సమాఖ్యలలో 2024 మార్చి 31 వరకు లక్ష్యాన్ని పూర్తి చేసేలా సహకరించాలన్నారు. అలాగే స్త్రీనిధి ద్వారా సోలార్‌ సిస్టమ్స్‌, ఎలక్ట్రిక్‌ ఆటోలు, ఎలక్ట్రిక్‌ వెహికల్స్‌కు రుణాలు ఇస్తామన్నారు. తీసుకున్న రుణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టాల ని సూచించారు. సమావేశంలో ఏపీడీ టి.మధుసూదన్‌, డీపీఎంలు ఎన్‌ శ్రీనివాస్‌, సంధ్యారాణి, నీలిమ, సాయిలు, మారుతి, రాచయ్య, ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య కార్యదర్శి వనిత, కోశాధికారి లక్ష్మి, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మోపాల్‌ : మండలంలోని మంచిప్పలో బైక్‌, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన గోవూరు గంగారెడ్డికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారెడ్డి నిజామాబాద్‌నుంచి మంచిప్పకు వస్తుండగా, అదేసమయంలో బోధన్‌కు చెందిన పాత సామగ్రి, బీరు సీసాలు కొనుగోలు చేసే వ్యక్తి ఆటో నిజామాబాద్‌ వైపు వెళ్తున్నది. మంచిప్ప గ్రామంలోనే అంబేడ్కర్‌ విగ్రహం వద్ద బైక్‌, ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో గంగారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

మతిస్థిమితంలేని వ్యక్తి అదృశ్యం



ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఆటోనగర్‌కు చెందిన దేవనల్‌ శివాజీ(58) అదృశ్యమైనట్లు ఎస్సై రవీందర్‌ మంగళవారం తెలిపారు. శివాజీకి మతిస్థిమితం లేదని, బంధువులు అతడి ఆచూకీకోసం ఎంత వెతికినా లభించలేదన్నారు. శివాజీ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. శివాజీ ఆచూకీ తెలిసిన వారు 96035 54904 నంబర్‌కు లేదా పోలీస్‌స్టేషన్‌ నంబర్‌ 87126 59848కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

పిట్లం(జుక్కల్‌): మండలంలోని గోద్మెగాం శివారులో బోరుమోటార్‌ విద్యుత్‌ తీగలు తగిలి దేవీదాస్‌శంకర్‌(37) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్‌ జిల్లాకు చెందిన దేవీదాస్‌శంకర్‌ ఈ నెల 1న కంగ్టి మండలంలోని ఓ మిల్లులో పనికి చేరాడు. 4వ తేదీన తన ఇంటికి వెళ్తానని మద్యంమత్తులో కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యంలో ఉన్న పిట్లం మండలం గోద్మెగాంశివారులోని పట్లోళ్ల సాయినాథ్‌రెడ్డి పొ లంలో ప్రమాదవశాత్తు బోరు కరెంట్‌ వైర్లు తగిలి మృతి చెందాడు. మృతుడి అన్న రాంకాంత్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై

స్కూల్‌ బస్సు ఢీకొని మహిళ..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని గంట్యాడ తండా వద్ద మంగళవారం ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు ఢీకొట్టిన ఘటనలో మహిళ మృతి చెందింది. అబ్బాపూర్‌ తండాకు చెందిన సివిబాయి(60) సజ్జనాయక్‌ తండాలో ఉన్న కూతురు వద్దకు వచ్చింది. అనారోగ్యంతో బాధపడు తున్న ఆమె.. రతన్‌సింగ్‌ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ఉత్తునూర్‌కు వెళ్లి వైద్యం చేయించుకుని వజ్జపల్లితండా వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెను క నుంచి వస్తున్న స్కూల్‌ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సివిబాయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.



రోదిస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు..



పిట్లం(జుక్కల్‌): మండలంలోని ధర్మారం గ్రామ శివారులోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వానం ఢీకొని రాజ్యం తుకారాం (28) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద కొడప్‌గల్‌ మండలంలోని కాస్లాబాద్‌కు చెందిన రాజ్యం తుకారాం ఇంట్లో గొడవపడి తన భార్య షెవంతతో కలిసి కాలినడకన హైదరాబాద్‌కు బయల్దేరాడు. పిట్లం మండలం ధర్మారం గ్రామశివారులో జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తుకారాం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.